# The song goes on…. *In memory of Rafi saab!*

"తుమ్ ముఝే యు భులా న పావోగే
జబ్ కభీ భీ సునోగె గీత్ మేరే
సంగ్ సంగ్ తుమ్ భీ గున్ గునావోగే"

"నన్ను నువ్వు మర్చిపోలేవు, నా పాటలు విన్నప్పుడల్లా నాతో పాటు గొంతు కలుపుతావు".

నిజం కదా! రఫీ 'పగ్లా కహీ కా' అనే చిత్రంలో పాడిన ఈ పాట ఎంత అర్థవంతంగా ఉందో అనిపిస్తుంది. ఏ చాయ్ దుకాణంలోనో, ఏ మెకానిక్ షాప్ లోనో మనం రఫీ పాటలు విన్నప్పుడు అప్రయత్నంగానే గొంతు కలుపుతాం. అందుకే ఆయన మన హృదయాలలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు.

రఫీ అని మనం అభిమానంగా పిలుచుకునే మహమ్మద్ రఫీ డిసెంబర్ 24, 1924 న అమృత్‌సర్ దగ్గర గల కోట సుల్తాన్ సింగ్ అనే గ్రామంలో జన్మించారు. తన 20వ ఏటనే ఎన్నెన్నో ఆశలతో కలల నగరంగా పేరు తెచ్చుకున్న ముంబయి లో అడుగు పెట్టారు. నౌషాద్ సంగీత సారథ్యంలో 'పెహలే ఆప్' అనే చిత్రంలో " హిందుస్తాన్ కే హై హమ్ హిందుస్తాన్ హమారా" అనే పాటలో కోరస్ గా గొంతు కలిపారు. అప్పుడే ఏర్పడింది సంగీత గంగా-యమునల సంగమం రఫీ-నౌషాద్ కలయికతో.

అంతర్వాహినిలా ఉండే సరస్వతి నదిలా వీరికి షకీల్ బదాయుని కలిసారు. ఆ త్రివేణీ సంగమంలో స్నానం చేస్తే పాపాలు పోతాయి అంటారు.. మరి ఈ సంగీత త్రివేణీ సంగమంలో స్నానం చేస్తే చెవులకు పట్టిన జన్మాంతర తుప్పు వదిలిపోతుంది!

రఫీ తన 36 సంవత్సరాల సినీ ప్రస్థానంలో దాదాపుగా 8,000 పాటలు పాడారు. అందులో హిందీలోనే సుమారు 6,000 పాటలు పాడి ఉండొచ్చని ఒక అంచనా. హిందీ పరిశ్రమలో ఆయన గొంతు అరువు తీసుకోని వారు ఎవ్వరూ లేరు. బహుశా సినీ సంగీత చరిత్రలో మూడు తరాలకు పాడిన గాయకులు ఇద్దరే. ఒకరు, రఫీ అయితే ఇంకొకరు రఫీను ఇతోధికంగా అభిమానించే మన బాలు! దిలీప్ కుమార్,

రాజేంద్ర కుమార్, షమ్మీ కపూర్ విజయాలలో రఫీ పాత్ర ఎంతో ఉంది.

రఫీ గాయక శైలిలో ఉన్న విశేషం ఏమిటంటే ఆయన పాట వింటూంటే మనకు ఆ పాట తప్పా ఇంకేమీ గుర్తుకు రాదు. ముక్కూ మొహము తెలీని, కేవలం ఒకే చిత్రంలో నటించిన ఎందరో నటులకు రఫీ అజరామరమైన పాటలు పాడారు. ఊరూ పేరూ లేని హీరోలకు అత్యధిక హిట్స్ ఇచ్చిన గాయకుడు రఫీ ఒక్కరే. ఘంటసాల ఏయన్నార్/ఎన్టీయార్ లకు, యస్పీబి కృష్ణ/శోభన్/చలం/కమల్ లకు, పీబీయస్ కాంతారావు/రాజకుమార్/జగ్గయ్యలకు, టియమ్మెస్ ఎమ్‌జీఆర్/శివాజీ లకు ఎక్కువగా హిట్ పాటలు పాడారు. కానీ రఫీ పాడిన హిట్స్ చూస్తే మనకిలా అనిపించదు!!

4to40.com

"యే జుల్ఫ్ కైసీ హై జంజీర్ జైసీ హై"
"కోయీ జబ్ రాహ్ న పాయే మేరే సంగ్ ఆయే"
"మొహబ్బత్ జిందా రెహతీ హై మొహబ్బత్ మర్ నహీ సక్తీ"
"బస్తి బస్తి పర్బత్ పర్బత్ గాతా జాయే బంజారా"
"జర సామనే తో ఆవో ఛలియే"

పై హిట్ పాటల నటులు ఎవరో బహుశా చాలా మంది చెప్పలేకపోవచ్చు, కానీ ఆ కాలంలో ఇవన్నీ సుపర్ హిట్స్.

**"Rafi is the most versatile playback singer music industry has ever seen".** ఈ మాటలు అన్నది వేరెవరో కాదు, మన ఎస్పీబీ. ఆయన అంటారు, "రఫీ గొంతులో పలికినన్ని వైవిధ్యమైన భావాలు వేరెవరి గొంతులోను పలకవు" అని!

**"He was the most talented singer amongst us"** అన్నారు ఎంతో అభిమానంగా నాటి తరం మేటి గాయకుడు మన్నాడే

రఫీ ఎంత మధుర గాయకుడో అంతే సున్నిత మనస్కుడు. ఎంత సున్నిత మనస్కుడు అంటే 'భలే తమ్ముడు' లో అన్ని పాటలూ పాడవలసి వచ్చినప్పుడు తెలుగులో లీడ్ సింగర్ ఘంటసాల గారిని కలిసి "నన్ను పాడమంటున్నారు, మీ అభిప్రాయం ఎమిటి?" అని అడిగారట! దానికి మన మాస్టారు గారు "నిరభ్యంతరంగా పాడు బాబు, నేను పాడేదానికన్నా రెట్టింపు నీకిస్తుంటే ఎందుకు సంకోచిస్తావు!"

అన్నారట.

తమ పని పాటలు పాడటం మాత్రమే, ఆ పనిని ఎంత శ్రద్ధగా చేసాము అనేదే ముఖ్యం అని గాఢంగా నమ్మిన వ్యక్తి రఫీ. అందుకే గాయకులకు రాయల్టి చెల్లించాలి అని లతా ఉద్యమం లేవదీసినప్పుడు రఫీ సహకరించలేదు, తత్పర్యవసానం.. లతా రఫీ తో దాదాపుగా 4 సంవత్సరాలు కలిసి పాడలేదు!!

4to40.com

రఫీ కు ఏడుగురు సంతానం. పాటలు, ఇల్లు, ఇల్లాలు, పిల్లలు తప్ప అయన వేరే జీవితం ఎరుగని వ్యక్తి. ఎంత అలసిపోయి ఇంటికి వచ్చినా పిల్లల కోసం పాటలు పాడేవారట.

మరి రఫీ సంస్మరణార్థం ఆయన పాటల ద్వారా ఆయన్ని స్మరించుకుందామా-

"సుహానీ రాత్ ఢల్ చుకీ నా జానే తుమ్ కబ్ ఆవోగి" - ఈ పాట పుట్టి 48 వసంతాలు అయ్యాయంటే నమ్మగలమా. 1949 లో విడుదలైన 'దులారి' చిత్రం లోనిదీ పాట. ఈ పాట వినని, ఇష్టపడని వ్యక్తి బహుశా భారత దేశంలో లేకపోవచ్చు. 1944 లో సినీ పరిశ్రమలో అడుగుపెట్టిన రఫీ కి ఇది మొదటి సూపర్ హిట్. భారత సినీ సంగీత చరిత్రలో ఇది మొదటి ఇంటర్నేషనల్ హిట్. ఎంత హిట్ అంటే ట్రినిడాడ్ లేక సూరినామ్ లో ఈ పాటను జాతీయ గీతంగా పాడేవారంట! (ఎక్కడో చదివిన గుర్తు)

షకీల్ బదాయుని రాసిన ఈ పాట నౌషాద్ స్వరసారధ్యంలో రఫీ అజరామరంగా గానం చేసారు. ఇంకో ఆశక్తికరమైన విషయమేమిటంటే రెండవతరం గాయకులైన ఏసుదాస్, మనహర ఉదాస్, యస్పీబీ వీరందరికీ అత్యంత ఇష్టమైన పాట ఇది!

"చౌదవీ కా చాంద్ హో యా ఆఫ్ తాబ్ హో" - 1958 'చౌదవీ కా చాంద్' చిత్రం కోసం సాహిర్ రాయగా, రవి స్వరపరచిన పాట. సాహిర్ సాహిత్యానికి, రవి సంగీతానికి, వహీదా అందం తోడై, గురుదత్ మార్కు క్లోజప్ షాట్స్ తో అత్యంత మనోహరంగా రూపొందిన గీతం ఇది. రఫీ కి మొట్టమొదటి ఫిలిమ్ ఫేర్ అవార్డ్ తెచ్చిపెట్టిన పాట ఇది. పహాడి రాగంలో ఉన్న ఈ పాటను రాత్రి పూట మంద్ర స్థాయిలో వింటూ ఉండండి, రెండుసార్లు వినేలోపు మీకు నిద్రపట్టించేస్తారు తన తీయటి గొంతుతో రఫీ.

"తేరి ప్యారీ ప్యారీ సూరత్ కో కిసీకీ నజర్ న లగే" - 'ఇల్లరికం' చిత్రం హిందీలో తీస్తున్నప్పుడు "నిలువవే వాలు కనుల దానా" పాట స్థానంలో వచ్చే పాట ఇది. అప్పటికే తెలుగునాట ఈ పాట

అత్యధిక జనాదరణ పొందింది. అదే ట్యూన్ హిందీలో పెడదామనుకున్నారు, కానీ హజరత్ జైపురి రాసిన పాట చూసిన తరువాత శంకర్-జైకిషన్ లు మనసు మార్చుకుని మరో దీటైన ట్యూన్ చేశారు. దాన్ని అంతే భావబంధురంగా పాడారు రఫీ. అసలు చష్మేబద్దూ అనే పదం హజరత్ జైపురి ఎవరి ఇంటికో బారసాలకు వెళ్ళినప్పుడు ఎవరో అనడం విని స్పాట్ లో పల్లవి రాసుకున్నారంట!

4to40.com

హిందీ చిత్రసీమలో నౌషద్ పేరు చిరస్మరణీయంగా నిలబెట్టిన చిత్రం 'బైజు బావరా'. అక్బర్ కాలం నాటి చారిత్రాత్మక చిత్రానికి నౌషద్ చరితార్థమైన సంగీతం ఇచ్చారు. ఒకదాని కంటే మరొకటి అనిపించే పాటలు.. అందులో ఒక పాట రికార్డింగుకు ముందు రఫీతో నౌషద్ అన్నారంట "నీ జీవితంలో మైలురాయిగా నిలిచిపోయే పాటనిస్తున్నాను, ఇక వెనక్కి తిరిగి చూసే అవసరం రాదు, జాగ్రత్తగా పాడు" అని. ఆ పాటే "ఓ దునియా కే రఖవాలే సున్ దర్ద్ భరే మెరే నాలే". ఒళ్ళు పులకరించడం, భావస్పందన తో జలదరింపు కలగడం అంటే ఏమిటో అనుభవించాలంటే రఫీ తారస్థాయిలో పాడే "అబ్ తో నీర్ బహాలే" అనే చరణం ముగింపు వినాల్సిందే!

"ఒహోహో.. ఖోయా ఖోయా చాంద్.. ఖులా ఆస్మాన్, ఆంఖోంమే సారీ రాత్ జాయేగీ.. తుం కో భీ కైసే నీంద్ ఆయేగీ" - 'కాలాబజార్' లోని ఈ పాట ఎంతగా ప్రజాదరణ పొందిందంటే నేటికి వివిధభారతి ప్రసారం చేసే 'ఆప్ కీ ఫర్మాయిష్' కార్యక్రమంలో రోజుకు కనీసం రెండుసార్లైనా వస్తుంది. పండు వెన్నెల్లో, కారులో డ్రైవ్ వెళ్తూ ఈ పాట వినండి. ఆ అనుభూతి మాటల్లో వర్ణించనలవికాదు. రఫీ "ఒ హో హో " అంటుంటే గొంతు కలపకుండ ఉండడం అసాధ్యం అనిపిస్తుంది.

"యే చాంద్ సా రోషన్ చెహరా, యే ఝీల్ సి నీలీ ఆంఖే.. కోయి రాజ్ హై" - రఫీ గొంతులో ఎన్నెన్నో హొయలు పోయిన పాట ఇది. కాశ్మీర్ దాల్ సరస్సు అందాలకు, షర్మిలా టాగోర్ సొగసులు తోడై, షమ్మీ కపూర్ మార్కు ఊపుకు, ఓ.పి. నయ్యర్ దరువులు, ఎస్.హెచ్. బిహారీ పదాల విరుపులకు తుది మెరుగులు దిద్దింది రఫీ గాత్రం. రఫీ ఈ పాటలో "తారీఫ్ కరూ క్యా ఉస్ కీ" అనే వాక్యాన్ని ఒక్కొక్కసారి ఒకొక్కరకంగా పలుకుతారు. వర్సటాలిటీ అన్న పదానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదేమో!

"చాహుంగా మై తుఝే సాంఝ్ సవేరే" - 'దోస్తీ' లోని ఈ పాట ఒక సంగీత దర్శకుల జంటకు 3 దశాబ్దాల భవిష్యత్తు ఇచ్చింది. వారే లక్ష్మికాంత్-ప్యారేలాల్. 1964 లో విడుదలైన ఈ చిత్రం కేవలం పాటల వల్లే జుబ్లీ హిట్ గా మారింది. ఆర్ధత, కరుణ అనేవి చూపించడమే కాదు వినిపించొచ్చు అని

నిరూపించాడు రఫీ ఈ పాటలో. "దర్ద్ భి తూ, చైన్ భీ తూ... ముఝ్ కో బార్ బార్ అవాజ్ మై న దూంగా" ఇక్కడ 'అవాజ్ మై న దూంగా' అని రఫీ పలకడం అమోఘం. ఈ పాట ఎవరు పాడినా రఫీ పాడినట్లే పాడాలని ప్రయత్నిస్తారు.

హిందీ సంగీత ప్రపంచం లో మదన్ మోహన్ నిజంగా స్వర మోహనుడే! ఒక్కొక్క ట్యూన్ ఒక్కొక్క ఆణిముత్యం. "ఏ దునియా.. ఏ మెహ్ఫిల్ మేరే కామ్ కి నహీ" - భగ్న ప్రేమికుడి హృదయఘోష రఫీ గొంతులో ఎగిసిపడే కెరటంలా సాగుతుంది. 'హీర్ రాంఝా' చిత్రం కోసం మదన్ మోహన్ స్వర పరచిన ఈ పాట వినండి, రఫీ స్టైల్ అంటే ఏమిటో అర్థం అవుతుంది. "ఏ మెహ్ఫిల్" అని రఫీ పలకడం యస్పీబి ను ఎంత ఇన్ స్పైర్ చేసిందో అర్థం అవుతుంది!

4to40.com

సామాన్యంగా మనం హాస్యనటులను రెండు విభాగాలలో ఉంచవచ్చు. కేవలం వాచకంతో హాస్యాన్ని పుట్టించగల రేలంగి, దేవన్ వర్మ, సియస్సార్, అస్రాని, మెహమూద్ లాంటి వాళ్ళు ఈ కోవకు చెందితే, శారీరకంగా హాస్యాన్ని అభినయించే శివరావు, పద్మనాభం, కేష్టో ముఖర్జీ, రమణారెడ్డి వంటి వాళ్ళు ఈ కోవకు చెందుతారు. అటు వాచకంతో, ఇటు శరీరంతో హాస్యాన్ని పండించగల అరుదైన కొవకు చెందిన నటులు రాజబాబు మరియు జానీవాకర్!!

బద్రుద్దీన్ ఖాజి అనబడే జానీవాకర్ 'బాజీ' అనే చిత్రంలో మొదటి సారి నటించాడు. హిందీ చిత్రసీమలో తిరుగులేని కామెడీ సూపర్ స్టార్ అయ్యాడు. జానీవాకర్ లేడంటే బయ్యర్స్ లేరు అనేంతగా ఉండేది అతని పాపులారిటీ. ఎంత పాపులర్ అయ్యాడంటే హాస్యనటుడికి ఒక పాట ఉండడం అనేది సినిమా లో ఒక ఫార్ములా లాగా అయిపోయింది.

తన శరీరాన్ని ఎన్నో మెలికలు తిప్పుతూ నటించేవాడు. ఆయన తన శరీరాన్ని ఎన్ని మెలికలు తిప్పగలడో అంతకు రెట్టింపు మెలికలను తన గొంతులో పలికించగలను అని రఫీ నిరూపించిన పాట 'ప్యాసా' చిత్రం లోని బర్మన్ పాట, "సర్ జో తెరా చకరాయే యా దిల్ డూబా జాయే". మీకు నమ్మకం కలగలేదంటే ఈ పాట ఆసాంతం వినండి, "దిల్ డూబా జాయే", "కాహె ఘబరాయె" లాంటి చోట్ల రఫీ చేసిన గమ్మత్తులు మీకే అర్థం అవుతాయి.

'దిల్ ఏక్ మందిర్' కోసం శైలేంద్ర రాయగా శంకర్-జైకిషన్ స్వరపరచిన ఈ పాట రఫీ నోట వింటే విరహం కూడా ఇంత మధురంగా వినిపించగలదా అని అనిపించకమానదు. అంత హృద్యంగా పాడారు

రఫీ. ఇంతకీ ఆ పాట గురించి చెప్పనేలేదు కదా, అది "యాద్ న జాయే బీతే దినోంకి". రఫీ పాడిన విరహ గీతాలలో నాకు అత్యంత ఇష్టమైన పాటలలో ఇది ఒకటి.

కామెడీ పాటలు రఫీ పాడినంత ఉల్లాసంగా వేరెవ్వరూ పాడలేరు అన్నది నిర్వివాదాంశం. జానీవాకర్ కి రఫీ దాదాపుగా 60 పాటలకు పైగా పాడారు. ప్రతీ పాట ఒక ఆణిముత్యం. అటువంటిదే 'Mr and Mrs. 55' లోని "జానే కహా మేరా జిగర్ గయా జీ". ఓ.పి. నయ్యర్ బీటుకు రఫీ పాడిన ఈ పాట ఎన్నిసార్లు విన్నా తనివి తీరదు.

రొమాంటిక్ హీరో దేవానంద్ చిత్రాలలో సాధారణంగా విషాద గీతాలు ఎక్కువగా ఉండవు. అటువంటిది ఆయన కోరి కోరి ఒక నెగిటివ్ షేడ్ ఉన్న సీరియస్ పాత్ర చేసిన 'గైడ్' లో ఒకదానికంటే ఒకటి అద్భుతమైన విషాద గీతాలు ఉన్నాయి. ఎస్.డి. బర్మన్ తన కెరీర్ లోనే అత్యుత్తమ సంగీతం అందించిన చిత్రంగా చెప్పబడే ఈ చిత్రంలో రఫీ పాడిన "క్యా సే క్యా హోగయా బేవఫా తేరే ప్యార్ మే" వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చిన ఆల్ టైం గ్రేటెస్ట్ గా పరిగణించవచ్చు.

"ఓ చెలీ కోపమా.. అంతలో తాపమా" పెండ్యాల 'శ్రీ కృష్ణ తులాభారం' కోసం దాశరధి రచనలో మాస్టారు పాడిన పాట విన్నారా? దాని మాతృక హిందీలో బీట్ మాస్టర్ ఓ. పి. నయ్యర్ 'ఏక్ ముసాఫిర్ ఏక్ హసీనా' కోసం ఎస్.హెచ్. బిహారీ రాసిన పాటను స్వరపరచినది. "హో ముఝే దేఖా కర్ ఆప్ కా ముస్కురానా" అనే ఈ పాట రఫీ  చాలా సాఫీగా, కాఫీ తాగిన ఆనందాన్ని ఆస్వాదిస్తూ పాడినట్టు ఉంటుంది. గొంతులో స్వింగ్ అంతే ఏమిటో ఈ పాటలో రఫీ మనకు చూపారు. "హో ముఝే" అని రఫీ ఎత్తుగడే అనితరసాధ్యం.

రోషన్ లాల్ నాగరత్ అంటే అదేదో మార్వాడీ కొట్టు ఓనర్ అనుకోకండి. ఆయన హిందీ సంగీత ప్రపంచంలో రోచనడు (ఇంద్రుడు) లాంటి వాడు. ఎన్నో ఎన్నెన్నో ఆణిముత్యాల్లాంటి పాటలు అందించిన వాడు. మచ్చుకు ఒకటి, అందులోనూ రఫీ కాంబినేషన్లో ,'భీగీ రాత్' చిత్రంలోని "దిల్ జో న కేహ సకా" రఫీ పాడిన క్లిష్టమైన పాటలలో నాకెంతో ఇష్టమైన పాట. పాట మొత్తం వివిధ గతులలో సాగుతుంది. "కెహనే కి రాత్"  అన్న చోట రఫీ ఎంత హాయిగా ఆలపిస్తారో!!

నవతరం సంగీత దర్శకులలో ఆర్.డి. బర్మన్ కిశోర్ కుమార్ గాత్రానికి ఎక్కువ మక్కువ చూపారు అని అంటారు. కానీ రఫీ ఆర్.డి. కాంబినేషన్ లోని పాటలు కూడా అంతే అద్భుతమైనవి. ఆర్.డి. బర్మన్ కు

దొరికిన మొట్ట మొదటి పెద్ద బ్యానర్ నాసిర్ హుస్సైన్ ఫిలిమ్స్ వారి 'తీస్రీ మంజిల్'. షమ్మీ కపూర్ కు ఆర్.డి. బర్మన్ మీద అంత నమ్మకం కలగలేదు మొదట్లో . కాని జూనియర్ బర్మన్ వినిపించిన మొదటి ట్యూన్ "ఓ హసీనా జుల్ఫో వాలీ" వింటూనే బర్మన్ అభిమానిగా మారిపోయాడు.

1966 సంవత్సరం లో అతి పెద్ద మ్యూజికల్ హిట్ గా నిలిచిందీ 'తీస్రీ మంజిల్'. అందులో ఆర్. డి, రఫీ ను అతి సమర్ధవంతంగా ఉపయోగించుకున్నాడు. "దీవానా ముఝ్ సా నహీ" కానీ, "ఆజా ఆజా మై హూ ప్యార్ తెరా" కానీ, "ఓ హసీనా జుల్ఫో వాలీ" కానీ తీసుకోండి అన్నీ సూపర్ హిట్స్. ఇన్ని ఫాస్ట్ బీట్ పాటల కమలాల మధ్య ఒక కలువ పువ్వు లాంటి పాట మరుగున పడిపోయింది. అది రఫీ చాలా భావనాత్మకంగా పాడిన "తుమ్నే ముఝే దేఖా హోకర్ మెహరుబాన్". ఆర్. డి. బర్మన్ టాలెంటుకు ఈ పాట ఒక మచ్చు తునక. అందులో "జానేమన్ జానేజా" అని పల్లవి చివరన కాస్త వ్యవధి ఇచ్చి మళ్ళీ పల్లవి "తుమ్నే ముఝే దేఖా" అని రఫీ ఎత్తుకోవడం ఆ పాటకే హైలెట్!!

4to40.com

ఇలా చెప్పుకుంటూ వెళ్తే వ్యాసం అనుకున్నది పుస్తకం అయిపోయే ప్రమాదం ఉంది. మరికొన్ని పాటలను, వాటి వెనుక కథలను మరల సందర్భానుసారంగా ఇంకొకసారి గుర్తుకు తెచ్చుకుందాము. అంతవరకు వినండి, వినిపించండి రఫీ పాడిన అమృతతుల్యమైన పాటలు!

మీ

*నందకిశోర్*
chiltu@gmail.com